చారిత్రక ఆనవాలు.. కనుమరుగు

- నరసాపురంలో శిథిలమవుతున్న శాంతి స్థూపం
- ఎవరూ పట్టించుకోని వైనం

నరసాపురం: గతం తాలూకా జ్ఞాపకాలను అందించే సమాచారం మన దగ్గర లేకపోతే చరిత్ర ఆనవాళ్లు కనుమరుగవుతాయి. ఒకప్పటి పరిస్థితులు, విషయాలు ప్రస్తుత, భవిష్యత్ తరాల వారికి తెలియకుండా పోతాయి. నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద 105 సంవత్సరాల క్రితం నిర్మించిన శాంతి స్థూపం విషయంలో ఇదే జరుగుతోంది. ప్రస్తుతం ఆ శాంతి స్థూపం శిథిలావస్థకు చేరింది. మొదటి ప్రపంచ యద్ధానంతరం శాంతికి గుర్తుగా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఈ స్థూపాన్ని నిర్మించింది. చారిత్రక నేపథ్యమున్న ఈ స్థూపం కొంత కాలానికి శిథిలమై కూలిపోయేలా ఉంది. అదే జరిగితే గతం తాలూకా ఆనవాళ్లు ఇక కన్పించవు. విషయానికి వస్తే మొదటి ప్రపంచ యుద్ధం 1914లో ప్రారంభమయ్యి 1918లో ముగిసింది. నాలుగేళ్లు జరిగిన ఈ మారణహోమంలో కోటి మంది వరకూ ప్రాణాలు కోల్పోయారనేది చరిత్ర. ఈ యుద్ధానంతరం ప్రపంచ వ్యాప్తంగా శాంతి అనే అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దీంతో యూఎన్ఓ లాంటి సంస్థలు ఏర్పడ్డాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత మరలా అలాంటి యుద్ధాలు రాకూడదని కోరుతూ మనదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం శాంతి ప్రచారాన్ని నిర్వహించింది. అందులో భాగంగానే నరసాపురంలో ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం వద్ద శాంతి స్థూపాన్ని 1919 డిసెంబర్ 13న నిర్మించారు. బ్రిటీష్ హయాంలో నరసాపురం ముఖ్య పాలనా కేంద్రంగా ఉండడంతో స్థూపాన్ని ఇక్కడ నిర్మించారు. ఇలాంటి స్థూపాలు జిల్లాలో మరెక్కడా లేకపోవడం గమనార్హం. స్థూపం వద్ద అప్పట్లో బ్రిటీష్ ఆర్మీ దళాలు క్రమం తప్పకుండా కొన్ని నెలలపాటు కవాతు నిర్వహించేవి.

శిథిలమవుతున్న చారిత్రక స్థూపం: స్వాతంత్ర్యానికి కాస్త ముందు 1939–44 మధ్య జరిగిన రెండవ ప్రపంచ యుద్ధ సమయంలోనూ ఈ స్థూపం వద్ద శాంతిని కోరుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారని చెబుతారు. సుమారు 20 అడుగుల ఎత్తులో ఉండే ఈ స్థూపం పైభాగంలో గడియారముండేది. పూర్వం నరసాపురం ప్రాంత వాసులు సమయాన్ని చూసుకోవడానికి ఈ గడియారమే ఆధారంగా వుండేది. ఈ స్థూపానికి ఎదురుగా ఉన్న వీధిని టవర్ స్ట్రీట్‌గా ఇప్పటికీ పిలుస్తున్నారు. ఇన్ని విశేషాలు ఇముడ్చుకున్న ఈ స్థూపం ప్రస్తుతం శిథిలమయ్యింది. చుట్టూ మొక్కలు పెరిగిపోయి, గడియారం స్థానంలో ఖాళీ ప్రదేశం మాత్రమే కన్పిస్తుంది. ప్రజా ప్రతినిధులు కాని, అధికారులు కాని, స్వచ్ఛంద సంస్థలు కాని దీనిపై దృష్టి సారిస్తే చారిత్రక స్మృతులు నిలుస్తాయనే వాదనలు వినిపిస్తున్నాయి.



నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద శిథిలావస్థకు చేరిన శాంతిస్థూపం

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కంబాల వారి వీధిలో వరసిద్ధి వినాయకుడు

పెనుగొండ: స్థానిక కంబాల వారి వీధిలో చెరువు గట్టు సమీపంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వినాయకుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రస్టీ పదవికి రాజీనామా



కెల్లా భూలక్ష్మి, ట్రస్టీ

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ట్రస్టీగా ఉన్న కెల్లా భూలక్ష్మి శుక్రవారం ఆ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆలయ ఈవోకి అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సిఫార్సుతో తనను ట్రస్టీగా నియమించారన్నారు. అయితే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అపజయంతో తాను మనస్థాపానికి గురై తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు భూలక్ష్మి రాజీనామా లేఖలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో లేకపోయినా వైఎస్ జగన్‌తోనే ఉంటానన్నారు. 2029లో పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తగా శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



స్థానిక లయన్స్ ఆదర్శ క్లబ్ నూతన కార్యవర్గం

ఆకివీడు: లయన్స్ ఆదర్శ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. క్లబ్ అధ్యక్షురాలిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజ రాజేశ్వరి, కార్యదర్శిగా మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ముదునూరి వెంకట సూర్య నాగమణితో కార్యవర్గం ఏర్పడింది. సంయుక్త కార్యదర్శిగా ఎస్వీజీ.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కేపీ.చంద్రశేఖర్, టీ.జితేంద్రబాబు, మెంబర్ షిప్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల రామచెంచయ్య, కార్యవర్గ నియామకం జరిగింది. త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనుందని ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు



గొంతువాపు వ్యాధి నివారణ టీకా వేస్తున్న మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య

ఆకివీడు: పశువుల్లో గొంతు వాపు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలతో టీకాలు వేయడం ప్రారంభించినట్లు మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య తెలిపారు. మండలంలోని అయిభీమవరంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించామని తెలిపారు. తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో వ్యాప్తి చెందే మల్టోసిడా అను సూక్ష్మ జీవుల వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. కళ్లు ఎర్రబడటం, నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, గొంతు క్రింది భాగంలో నొప్పులతో కూడిన వాపులు కలిగిన లక్షణాలుంటే గొంతువాపు వ్యాధి సంక్రమించినట్లేనన్నారు. వ్యాధి సోకిన పశువులు ఆహారం సక్రమంగా తీసుకోవని, వ్యాధి నిరోధక శక్తి పడిపోతుందని వైద్యురాలు భార్గవి అన్నారు. సరైన వైద్యం అందజేయకపోతే వ్యాధి సోకిన పశువు 48 గంటల్లో చనిపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ఆయా పశువైద్య కేంద్రాల్లో రైతులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

పేదలకు భోజనం పొట్లాల పంపిణీ

భీమవరం: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని గొల్లవాని తిప్ప రోడ్‌లో పేదకుటుంబాలకు శుక్రవారం భోజనం పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవునికి ప్రధాన అవసరాలైన నీరు, ఆహారం వంటివాటి విషయంలో ప్రజలు భద్రతలు పాటించాలన్నారు. ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా హర్షిత ఫుడ్స్ సహకారంతో పేద కుటుంబాలకు భోజనాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఇందుకూరి శివాజీవర్మ, వాల్మీకిబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు సరికాదు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడులు సరికాదని, ఇదే కొనసాగితే సహించేది లేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాకుండానే టీడీపీ, జనసేన కార్యకర్తలు చెలరేగిపోయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదన్నారు. వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. దాడులకు భయపడవద్దన్నారు. కార్యకర్యల కు అండగా ఉండేందుకు ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక కమిటీ వేశారన్నారు. అలాగే న్యాయవా దులను కూడా పార్టీ నియమించిందన్నారు.రాబోయే రోజుల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరా టాలు చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పటికీ టీడీపీ కార్యకర్తలపై ఏనాడు దాడులకు పాల్పడలేదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సార్వా సాగుకు రైతులు సిద్ధం కావాలి



రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రులో జీలుగ వేసిన చేలో నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: సార్వా సాగు పనులు చేపట్టేందుకు రైతులు సిద్ధం కావాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. శుక్రవారం రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రులో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుమడులు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. కాలువలో పూర్తి స్థాయిలో నీరులేకపోవడంతో తమ భూములకు సాగునీరందటం లేదని రైతులు తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చేలల్లో వర్షపు నీరు నిలిచింది. శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున దుక్కులు దున్నుకుని విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. నారు మడులు వేసుకోవడం ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి పాటించాలన్నారు. 150 రోజుల్లో పంట చేతికొచ్చే ఎంటాయూ 1061, 1064, 1318, పీఎల్ఏ 1100 రకం విత్తనాలు అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉంటామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు



శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్

నరసాపురం: విద్యార్థులు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. నరసాపురం ప్రథమశ్రేణి గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి ఉచిత విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సమయాన్ని వృధా చేయకుండా పుస్తక పఠనం, ఆటలు, యోగా వంటి అంశాల్లో శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ ఈ సంవత్సరం నిర్వహించిన విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో పిల్లలు తర్ఫీదు పొందారని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్.సుబ్బారావు, సీహెచ్.రెడ్డప్పధవేజీ, పండా నాగేంద్ర త్రినాథ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ధర్మ ప్రచారం



ఇంటింటికీ ధర్మ ప్రచారం కరపత్రాలను విడుదల చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రజలకు వివరించడానికి ఈ నెల 10 నుంచి ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమారస్వామి తెలిపారు. స్థానిక కేశవస్వామి ఆలయంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం కరపత్రాలను సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో కలసి శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఉన్న కులాల ఆవిర్భావం, వాటి విశిష్టత, కులవృత్తుల గురించి అవగాహన కల్పించడమే ఈ ధర్మ ప్రచారం ప్రధాన ధ్యేయమన్నారు. గ్రామ ధార్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హిందువులంతా విజయవంతం చేయాలని కుమారస్వామి కోరారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి రాజీనామా

యలమంచిలి: బాడవ గ్రామానికి చెందిన కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ఆమె వివరించారు. రాజీనామా పత్రాలను కాపు కార్పొరేషన్ కార్యాలయానికి పంపినట్లు ఆమె తెలిపారు.

పితానిని కలిసిన ఆర్వో

పెనుగొండ: ఆచంట ఎమ్మెల్యేగా ఎన్నికైన పితాని సత్యనారాయణను ఆచంట నియోజకవర్గ ఆర్వో వి.స్వామినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం కొమ్ముచిక్కాలలో ఎంపీడీవోలు, తహసీల్దారులు, మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కుళాయిల్లో మురుగునీరు

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొంత కాలంగా కుళాయిల నుంచి ముగురునీరు వస్తోంది. 30, 31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఖాతాదారులకు సూచనలు

భీమవరం: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీస్ భీమవరం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి ఖాతాదారులను, వ్యాపారవేత్తలను ఆహ్వానించి, వారికి బ్యాంకు స్కీమ్స్ గురించి వివరించారు. ఖాతాదారుల సూచనలు, సలహాలు తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ సంగీతా కుమారి మాట్లాడుతూ 13వ తేదిన ఎంఎస్ఎంఈ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్న బాబు, క్రెడిట్ హెడ్ రమేష్, ఎంఎల్‌పి హెడ్ రాకేష్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ పి.నాగరాజు

పాలకోడేరు: విద్యార్థులకు సెలవుల రోజుల్లో వివిధ పోటీ పరీక్షలు, శిక్షణ శిబిరాలు నిర్వహించడం వల్ల వారిలో సృజనాత్మకత బహిర్గతమవుతుందని పాలకోడేరు మండల విద్యా శాఖాధికారి పి .నాగరాజు అన్నారు. వేసవికాలం సెలవులు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలబాలికలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్లాస్టిక్ భూతం మనుగడకు విఘాతం

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పెరిగి పోతున్న వ్యర్థాలు
- రికార్డులకే పరిమితమైన నిషేధం



ప్లాస్టిక్ వినియోగంపై చిత్రం

వీరవాసరం: పట్టువదలని విక్రమార్కుడి భుజంపై మళ్లీ మళ్లీ ఎక్కే బేతాళుడిలా ప్లాస్టిక్ అందరిపైనా స్వారీ చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తిస్థాయిలో అమలైన జాడ లేదు. దాంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీల్లో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వాదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించే వారు. కొంత కాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలు పెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక కవర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్లు కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకుని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా వాటి వినియోగమే కాదు. రీసైక్లింగ్ కూడా జరుగుతోంది. వీటి వినియోగం పర్యావరణానికి చాలా ప్రమాదకరమని, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం

ఈ మధ్యనే మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీ శాఖ చర్యలు చేపట్టింది. అయినా గ్రామాల్లో ఏ దుకాణం చూసినా ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్తకుప్ప, మురుగుకాలువను చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు కవర్లు లేవంటున్నారు. వినియోగదారులు వస్తువులు వదిలి వెళ్లిపోతుంటే కవరు ఇస్తున్నారు. కవర్లు లేకపోతే తమకు వ్యాపారం జరగడం లేదని, వినియోగదారులు ఏ విధమైన సంచులు తీసుకురాకుండా వచ్చి వెళ్లిపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ఆరు నెలలుగా 30 నుంచి 40 శాతం వరకూ ఇవే ఉంటున్నాయి. ఏ చెత్తకుప్ప చూసినా, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే నిషేధం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోండి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పోటీతత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఆశించిన ఫలితాలు సాధించగలమని మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల తెలిపారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ ముగింపు సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఇటువంటి శిబిరాలు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. తీవ్రమైన ఎండల్లో బాలలు బయట తిరిగితే అనేక ప్రమాదాలు జరుగుతాయని ఇటువంటి శిబిరాలు కారణంగా విద్యార్థులు బయట తిరగకుండా శిబిరంలో పాల్గొంటే విజ్ఞానంతో పాటు క్రీడల్లో ప్రావీణ్య పెంచుకునే అవకాశముందన్నారు. గ్రంథాలయంలో ప్రతి ఏటా నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలకు గ్రంథాలయ చదువవరుల సంఘం అందజేస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటారు. గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం గతనెల 15వ తేదిన ప్రారంభించగా శుక్రవారం వరకు బాలల్లో సృజనాత్మక శక్తి పెంపొందించే డ్రాయింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లీష్ ,యోగా, చెస్, క్యారమ్స్ వంటివాటిలో శిక్షణ ఇచ్చామన్నారు. చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, శిబిరం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిల్లలకు వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వివిధ పోటీల్లో విజేతలైన బాలలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమలో చదు వరుల సంఘం సభ్యురాలు పి పద్మ, శ్రీనివాస్, మాధవి, కలిగొట్ల గోపాలశర్మ, షేక్ బాబాజీ, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పంట కాలువ ఇలా.. నీరందేదెలా..?

- ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువ కలుషితం
- సాగునీరందక ఇబ్బంది పడుతున్న రైతులు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పంట కాలువ

పాలకొల్లు అర్బన్: దిగమర్రు పంట కాలువ కలుషితమవుతోంది. ఈ కాలువ ద్వారా పెదగరువు, వరిధనం, కొంతేరు, కాజ, దిగమర్రు, కొత్తపేట, పెదమామిడిపల్లి, చిట్టవరం గ్రామాల్లోని పంట భూములకు సాగునీరు అందుతోంది. ఈ గ్రామాల్లోని మంచినీటి చెరువులకు నీరు కూడా ఈ పంట కాలువ ద్వారా చేరుతుంది. కాలువ కలుషితమవడంతో సాగునీటికి ఆటంకం ఏర్పడుతోంది.

పంట కాలువ స్వరూపం ఇదీ..

నరసాపుం – నిడదవోలు ప్రధాన పంట కాలువ నుంచి టాక్సీ స్టాండ్ వద్ద విలీనమై నరసాపురం మండలం చిట్టవరం వరకు సుమారు 6 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కాలువ ప్రారంభంలో 6.5 మీటర్ల వెడల్పుతో ప్రభుత్వాసుపత్రి వరకు అక్కడ నుంచి 5 మీటర్ల వెడల్పు పెదగరువు గరప కాలువ వరకు, 3.4 మీటర్ల వెడల్పుతో దిగమర్రు బ్రాంచ్ కాలువ వరకు, అక్కడ నుంచి చిట్టవరం వరకు 2 మీటర్లు వెడల్పుతో కాలువ ప్రవహిస్తుంది. ఈ కాలువపై వ్యాపారులు కల్వర్టులు కట్టడంతో నీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. అంతే కాకుండా పట్టణ వాసులు చెత్తా, చెదారాలను పంట కాలువలో వేయడంతో నీరు కలుషితమవుతోంది.

పట్టణంలోని మురుగు డ్రెయిన్‌లు పంట కాలువలోకి....

పట్టణంలోని ప్రధానంగా మూడు మురుగు డ్రెయిన్‌లు నేరుగా పంట కాలువలో కలుస్తున్నాయి. అలాగే 58 మంది గృహ యజమానులు లెట్రిన్ పైపులు నేరుగా పంట కాలువలో కలిపేశారు. చికెన్ వ్యాపారులు వ్యర్థాలను పంట కాలువలో కలిపేయడంతో నీరు కలుషితమవుతోంది. సార్వా, దాళ్వా పంట సమయంలో రైతులకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించి, పొలాలకు సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు.

పంట కాలువ ప్రక్షాళన చేయాలి..



దిగమర్రు పంట కాలువ ప్రక్షాళన చేయాలని దిగమర్రు సర్పంచ్ కోరారు. పంట కాలువ ఆక్రమణలు తొలగించాలని, కాలువలోకి పెట్టిన లెట్రిన్ పైపులు తొలగించాలని, పట్టణంలోని మురుగు డ్రెయిన్‌లను పంట కాలువలోకి కలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రాపాక నగేష్ కరుణాకర్, సర్పంచ్, దిగమర్రు

మూడు సార్లు లెట్రిన్ పైపులు తొలగించాం..



పంట కాలువలో పెట్టిన లెట్రిన్ పైపులను మూడు సార్లు తొలగించాం. అలాగే నోటీసులు కూడా ఇచ్చాం. పట్టణంలో మురుగు డ్రెయిన్‌లు పంట కాలువలో కలపవద్దని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

ఎస్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ, పాలకొల్లు